



# కరపత్రం

SINCE 2014

మంగళవారం సెప్టెంబర్ 23 2025 | సంపుటి :0 | సంచిక :335 | - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ | పేజీలు :4


## అరుణాచల్, త్రిపురల్లో

# నేడు మోదీ పర్యటన

### రూ.3,700 కోట్ల విలువైన జలవిద్యుత్తు ప్రాజెక్టులకు శంకుస్థాపన




ఈటానగర్: ప్రధాని మోదీ సోమవారం అరుణాచల్ ప్రదేశ్, త్రిపుర రాష్ట్రాల్లో పర్యటించనున్నారు. ఇరు రాష్ట్రాల్లోనూ సుమారు రూ.5 వేల కోట్ల విలువైన వివిధ మౌలిక వసతుల ప్రాజెక్టులను ఆవిష్కరించడంతో పాటు పలు అభివృద్ధి పనులనూ ప్రారంభిస్తారు. జల విద్యుదుత్పత్తికి ఎంతో అనువుగా ఉండే అరుణాచల్‌లో రూ.3,700 కోట్లతో నిర్మించనున్న తాతో-1, హియో జల విద్యుత్ కేంద్రాలు ప్రధాని శంకుస్థాపన చేసే ప్రాజెక్టుల జాబితాలో ఉన్నాయి. వీటితోపాటు 9,820 అడుగుల ఎత్తున ఉండే తవాంగ్‌లో నిర్మించనున్న భారీ కన్వెన్షన్ సెంటర్‌కూ ఆయన శంకుస్థాపన చేస్తారు. తొలుత ఈటానగర్‌లో పర్యటించే ప్రధాని.. శంకుస్థాపనలు, ప్రారంభ కార్యక్రమాల అనంతరం ప్రజలను ఉద్దేశించి సభలో ప్రసంగిస్తారు. అనంతరం త్రిపుర బయలుదేరుతారు. శక్తిపీఠాల్లో ఒకటైన గోమతి జిల్లా ఉదయ్‌పుర్‌లోని మాతా త్రిపుర సుందరి ఆలయ సముదాయం అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తారు. ఈ పర్యటనలో ప్రధాని వివిధ వర్గాల ప్రతినిధులతో సమావేశమవుతారని పీఎంవో ఓ ప్రకటనలో తెలిపింది.

పేజి 2లో ▶

## అహ్మదాబాద్ విమాన ప్రమాదంపై ప్రాథమిక నివేదిక

### పైలట్ల పనితీరుపై విమర్శలు సరికాదని సుప్రీం వ్యాఖ్య



అహ్మదాబాద్ ఎయిరిండియా విమాన ప్రమాదానికి సంబంధించిన ప్రాథమిక నివేదికపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. పైలట్ల పనితీరులో లోపాలు ఉన్నట్లు ఎయిర్‌క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో ప్రాథమిక నివేదికను అత్యున్నత న్యాయస్థానం పరిగణనలోకి తీసుకుంది. ఈ నివేదికపై ఊహాజనిత కథనాలు దురదృష్టకరమని, అది బాధ్యతారాహిత్యమేనని పేర్కొంది. ఈ ప్రమాదంపై స్వతంత్ర దర్యాప్తు కోరుతూ దాఖలైన పిటిషన్లపై స్పందన తెలియజేయాలంటూ కేంద్రం, డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్, ఎయిర్‌క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో కు నోటీసులు ఇచ్చింది.

పేజి 2లో ▶

## విజయవాడ ఉత్సవ్‌కు తొలగిన అడ్డంకి

### దేవాలయ భూముల వినియోగంపై పిటిషన్ డిస్మిస్



2లో

## విమానం గాల్లో ఉండగా.. కాక్‌పిట్ డోర్ తెరవబోయిన ప్రయాణికుడు




2లో

## సమ్మక్క సాగర్ ప్రాజెక్టు..

### ఎన్‌వోసీ జారీకి ఛత్తీస్‌గఢ్ సీఎం అంగీకారం!



రాయ్‌పుర్: ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి విష్ణుదేవ్ సాయ్‌ని తెలంగాణ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి సోమవారం కలిశారు. గోదావరిపై తెలంగాణ చేపట్టిన సమ్మక్క సాగర్ ప్రాజెక్టు నిర్మాణానికి నిరభ్యంతర పత్రం జారీ చేయాలని ఆయన్ను కోరారు. ఛత్తీస్‌గఢ్‌లో ముంపునకు గురయ్యే ప్రాంతానికి పరిహారం ఇస్తామని తెలిపారు. సహాయ, పునరావాస చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. దీంతో ఈ ప్రాజెక్టుకు ఎన్‌వోసీ జారీకి ఛత్తీస్‌గఢ్ సీఎం సూత్రప్రాయంగా ఆమోదం తెలపడంతో తెలంగాణ తరఫున ఆయనకు ఉత్తమ్ ధన్యవాదాలు చెప్పారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించి ఎన్‌వోసీపై చర్చించేందుకు తనకు సమయం ఇవ్వాలని కోరుతూ సీఎం విష్ణుదేవ్ సాయ్‌కు ఇటీవల ఉత్తమ్ లేఖ రాసిన విషయం తెలిసిందే.

తెలంగాణలో నీటి లభ్యతను పెంచేందుకు గోదావరిపై 6.7 టీఎంసీల సామర్థ్యంతో సమ్మక్క సాగర్ బ్యారేజీ నిర్మాణం చేపట్టారు. ఈ ప్రాజెక్టు వెనుక జలాల వల్ల ఛత్తీస్‌గఢ్‌లో కొంత భూభాగం ముంపునకు గురవుతోంది. ముంపు ప్రాంతంలో భూసేకరణ, పరిహారం చెల్లించే విషయంపై ఇప్పటికే ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వంతో ఉత్తర ప్రత్యుత్తరాలు జరిపారు. ఇదే అంశంపై ఎన్‌వోసీ జారీలో సీఎం సహకారం గురించి ఉత్తమ్ ఇటీవల ఛత్తీస్‌గఢ్ సీఎంకు రాసిన లేఖలో ప్రస్తావించారు.




# సింగరేణి కార్మికులకు బోనస్

## ప్రకటించిన తెలంగాణ ప్రభుత్వం

దసరా పండుగ సందర్భంగా సింగరేణి కార్మికులకు తెలంగాణ ప్రభుత్వం బోనస్ ప్రకటించింది.

సింగరేణి లాభాల్లో 34% కార్మికులకు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది.

ఒక్కో శాశ్వత కార్మికుడికి రూ.1,95,610 బోనస్‌గా ఇవ్వనున్నారు.

41 వేల మంది శాశ్వత ఉద్యోగులకు మొత్తం రూ.819 కోట్లు పంపిణీ చేస్తారు.

30 వేల మంది కాంట్రాక్ట్ కార్మికులకు కూడా ఒక్కొక్కరికి రూ.5,500 చొప్పున బోనస్ ఇవ్వనున్నట్లు తెలిపారు.

2లో

## మనవాళలకు ఆటంకంగా మారిన అమెరికా విధానాలు

### కేంద్రం రిమ్మకె నీరెత్తినట్లుగా ఉంది: పొన్నం



హుస్నాబాద్ శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయంలో కుటు-ంబ సమేతంగా అమ్మవారిని మంత్రి పొన్నం ప్రభాకర్ దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం హుస్నాబాద్ ఎల్లమ్మ చెరువు కట్ట సుందరీకరణ, సద్దుల బతుకమ్మ ఏర్పాట్లను పరిశీలించారు.

పేజి 2లో ▶

## 923 ఎకరాలను ఆక్రమణల నుంచి రక్షించాం: హైడ్రా కమిషనర్



హైదరాబాద్: ఇప్పటివరకు మొత్తం 923 ఎకరాలను ఆక్రమణల నుంచి రక్షించామని హైడ్రా కమిషనర్ రంగనాథ్ తెలిపారు. హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. సుమారు రూ.50 వేల కోట్ల విలువైన ప్రభుత్వ భూములు రక్షించినట్లు తెలిపారు. హైదరాబాద్ నగరంలో దాదాపు 60 చెరువులు కనుమరుగయ్యాయని చెప్పారు.

పేజి 2లో ▶

## మీ సమస్య పరిష్కరించకుంటే స్థానిక ఎన్నికలు బహిష్కరించండి: కేటీఆర్



**స్థానిక ఎన్నికలు బహిష్కరించడం ద్వారా ఈ సమస్య దిల్లీకి చేరుకుంటుందని చెప్పారు.**

**గతంలో ఔటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్) వేసినప్పుడు కూడా అలైన్‌మెంట్‌ను మార్చారని కేటీఆర్ తెలిపారు.**

**భూమి కోల్పోతున్న రైతులకు భూమికి బదులు భూమి ఇవ్వడంపై పోరాటం చేయవచ్చని సూచించారు.**

హైదరాబాద్: నల్గొండ, సూర్యాపేట జిల్లాకు చెందిన ఆర్ఆర్ఆర్ బాధితులంతా ఐకమత్యంగా ఉండాలని భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు, మాజీ మంత్రి కేటీఆర్ సూచించారు. నల్గొండ, సూర్యాపేట జిల్లాల ట్రిపుల్ ఆర్ బాధితులు సోమవారం తెలంగాణ భవన్‌లో కేటీఆర్‌ను కలిసి సమస్యలు విన్నవించారు.

పేజి 2లో ▶

## హైదరాబాద్‌లో భారీ వర్షం.. పలు చోట్ల ట్రాఫిక్ జామ్



హైదరాబాద్: అల్పపీడనం ప్రభావంతో హైదరాబాద్‌లో పలుచోట్ల భారీ వర్షం కురిసింది. బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, అమీర్‌పేట, ఖైరతాబాద్, ఎల్బీనగర్, పెద్దఅంబర్‌పేట తదితర ప్రాంతాల్లో కురిసిన వర్షానికి రహదారులపై నీరు నిలిచింది.

## కారు పార్టీ అక్రమంగా తెచ్చిన లగ్జరీ కార్లపై నడుస్తోందా?: బండి సంజయ్



2లో

కరపత్రం
తెలుగు దిన పత్రిక
మంగళవారం సెప్టెంబర్ 23 2025

# మధునాపంతుల స్ఫూర్తి చిహ్నం ఆంధ్రీ కుటీరం

ఫ్రెంచి యానాం పట్టణ గ్రామానికి అతి సమీపంలో ఉన్న కుగ్రామం పల్లిపాలెం. ఇక్కడి నుంచే ఆంధ్ర పురాణం కావ్యకర్త మధునాపంతుల సత్యనారాయణ శాస్త్రి గారు తన సాహిత్య ప్రయాణాన్ని ప్రారంభించారు. ఆయనే దాదాపు ఏడున్నర దశాబ్దాల క్రితం ఈ ఊరిలో 'ఆంధ్రీ కుటీరం'ను ప్రారంభించారు. ప్రాంతాలతో సంబంధం లేకుండా అన్ని ప్రాంతాలకు చెందిన కవులు, రచయితలు ఈ గ్రామం వచ్చి, ఆంధ్రీ కుటీరంలో తమ సాహిత్య సంపదను పంచుకున్నారు. ఈ కుటీరాన్ని, దాని తరఫున జరిగిన సాహిత్య సేవని ఇప్పుడు మధునాపంతుల సత్యనారాయణ శాస్త్రి గారి తమ్ముడి కుమారుడు మధునాపంతుల సత్యనారాయణ నేటికీ కొనసాగిస్తున్నారు. ఆంధ్రీ కుటీరం నిర్వహణ గురించి, దాని ఆధ్వర్యంలో జరుగుతున్న వివిధ కార్యక్రమాల గురించి సత్యనారాయణ గారితో జరిపిన సంభాషణ ఇది.కోనసీమ జిల్లాలో మారుమూల ఉన్న ఈ పల్లిపాలెంలో ఆంధ్రీ కుటీరం గురించి, ఇక్కడికి వచ్చిన గొప్ప సాహితీవేత్తల గురించి, మీరు ఇప్పుడు చేస్తున్న కార్యక్రమాల గురించి చెప్పండి? కాకినాడ జిల్లా, కాజులూరు మండలం, పల్లిపాలెం మా స్వగ్రామం. శతాబ్దాల క్రితం ఇక్కడకు వచ్చి మా కుటుంబాలు స్థిరపడ్డాయి. భిషగ్రత్న మధునాపంతుల సత్య నారాయణ మూర్తి %-% లక్ష్మమ్మల ప్రథమ సంతానం కళా ప్రపూర్ణ మధునాపంతుల సత్యనారాయణ శాస్త్రిగారు. ఆయన తమ్ముడు మధునాపంతుల సూరయ్య శాస్త్రి. సత్యనారాయణ శాస్త్రి గారు తన 14వ ఏట ఈ ఆంధ్రీకుటీరం స్థాపించారు. ఆంధ్రీ కుటీర లక్ష్యాలు%-% గ్రామంలో సాహిత్య చైతన్యం తీసుకురావడం, యువత దారి తప్పకుండా వారిని పఠనం వైపు, రచనల వైపు మళ్ళించడం, దళితులకు సంస్కృత విద్యాబోధన, అలాగే ఒక గ్రంథాలయ స్థాపన. ఆంధ్రీకుటీరం 1939లో 'ఆంధ్రి' అనే మాసపత్రికను ప్రారంభించింది. దీనికి పిఠాపురం ఆస్థాన కవి ఓలేటి వేంకట రామ శాస్త్రి సర్వాధ్యక్షులు. 'ఆంధ్రి' పత్రికకు చెళ్ళపిళ్ళ వెంకట శాస్త్రి మొదలుకొని గుర్రం జాషువా వంటివారు తమ రచనలు పంపి ప్రోత్సహించారు. అయితే 42 సంచికలు మాత్రమే వచ్చాయి. రెండవ ప్రపంచ యుద్ధం కారణంగా పేపర్ కొరత మొదలైన సమస్యల వల్ల పత్రిక ఆగిపోయింది. 'ఆంధ్రి' పత్రిక ద్వారా ప్రసిద్ధులైన రచయితలను పరిచయం చేస్తూ మధునాపంతుల సంపాదక వ్యాసాలు రాశారు. అవి అనంతర కాలంలో శతాధిక రచయితల సమాచారంతో 'ఆంధ్ర రచయితలు' అనే ప్రామాణిక గ్రంథంగా విడుదలయ్యింది.మీ పెద్దనాన్నగారికి మీరు సాహిత్య వారసులు అనుకోవాలా? మీ కుటుంబంలో మరెవరైనా సాహిత్య సృజన చేసినవారున్నారా? ఆస్తికైతే ప్రత్యకించి వారసులు ఉంటారు. కానీ సాహిత్యకారులకు ఆ రంగంలో విశేష కృషి చేస్తున్న వారంతా వారసులే. నా వరకు నేను భాషా ప్రవీణ చదువుకుని పండిత శిక్షణ పొంది తెలుగు ఎంఏ చేసి మూడు దశాబ్దాలు తెలుగు పండితుడుగా పనిచేసిన వాడినే. కుటుంబ వాతావరణం, సంస్కృతాంధ్రాలు చదివి ఉండడం నన్ను సాహిత్యంవైపు, తెలుగు పండితుడిగా ఉద్యోగం వైపు ప్రోత్సహించాయి. పద్యం రాయడం మొదలుపెట్టిన రోజుల్లో పెద నాన్నగారి 'ఆంధ్ర పురాణం' చేతికొచ్చింది. రాస్తే పెద్దనాన్నగారిలా పద్యం రాయాలి. లేకపోతే ఊరుకోవాలి. కానీ ఊరుకోలేకపోయాను. వచన కవిత్వం వైపు మళ్లాను. 70%-%80 దశకాలలో కాకినాడలో గొప్ప సాహిత్య వాతావరణం ఉండేది. సోమ సుందర్, అద్దేపల్లి వంటి వారు ఉత్సాహభరితంగా సాహిత్య కార్యక్రమాలు చేసేవారు. వాటిలో పాల్గొనడం నాకు మరింత స్ఫూర్తినిచ్చింది. అప్పుడప్పుడు నేను రాసిన వచన కవిత్వం పత్రికల్లోనూ, ప్రత్యేక సంచికల్లోనూ ప్రచురణ కావడం మరింత ప్రోత్సాహాన్ని అందించింది.మధునాపంతుల కుటుంబంలో సత్యనారాయణశాస్త్రి గారి మూడవ కుమారుడు మధునామూర్తి జర్నలిస్టుగా ఉద్యోగం చేస్తున్నాడు. వ్యాస రచనలు చేశాడు. మా చిన్నమ్మాయి మధునాపంతుల (ఆకొండి) రత్న కళిక కవిత్వం రాయడమే కాక 'ఆంధ్రి' పత్రికలపై పరిశోధన చేసి యంఫిల్ పట్టా పొందింది. మా తండ్రి 'మూక పంచశతి'ని అనువాదం చేసి 'దేవీ నవతి' పేరుతో ప్రకటించారు. మా తాతగారు 1927 లోనే ఆ కొండి రామమూర్తి గారి ఆయుర్వేద జీవితం మీద పెద్ద పుస్తకం రాశారు. ఆ విధంగా సత్యనారాయణ శాస్త్రి గారికి పూర్వమే సాహిత్య సృజన దిశగా అడుగులు వేసిన కుటుంబం మాది.ప్రతి ఏటా ఒక సీనియర్ రచయితకి, ఇద్దరు కొత్త వారికి మీరు కథా గౌరవ పురస్కారం ఇస్తున్నారు. దీని నేపథ్యం ఏమిటి? ఎంపిక బాధ్యత ఎవరిది? అలాగే ఆంధ్రీకుటీరం ఇస్తున్న ఇతర పురస్కారాల గురించి చెప్పండి?

మా కుటుంబాలకే చెందిన మధునాపంతుల వెంకటేశ్వర్లు మధుశ్రీలు పేరుతో కవితలు, కథలు రాసేవారు. ఆయన కుమారుడు కిరణ్ మధునాపంతుల సాఫ్ట్వేర్ రంగానికి చెందిన పారిశ్రామికవేత్త. ఆయన తన తండ్రి మరణానంతరం ఏటా 'కథా గౌరవం' అనే పేరుతో ఇద్దరు సీనియర్లకు రూ.20,000 చొప్పున ఒక కొత్త కథా రచయితకు రూ.10,000 చొప్పున నగదు బహుమతి ఇచ్చి సన్మానిస్తున్నారు. ఇక ఆంధ్రీకుటీరం పురస్కారాల మాటకొస్తే ఏటా మధునాపంతుల వారి జయంతులు, వర్ధంతులు జరుపుతాం. కవి పండితులను గౌరవిస్తాం. అలాగే రామకృష్ణ కవుల సాహిత్య సమాలోచన సభలు జరుపుతాం. అవధాన రంగానికి చెందిన వారిని గౌరవిస్తాం. ఆచార్య బేతవోలు రామబ్రహ్మం (పద్యకవిత్వం), దర్భశయనం శ్రీనివాస ఆచార్య (వచన కవిత్వం) మొదటి పురస్కారాలను అందుకున్నారు. ఇక పురస్కారాల ఎంపికకు ప్రత్యేకమైన జ్యూరీ అంటూ ఏమీ ఉండదు. మా కుటుంబాలలో చాలామంది మంచి చదువరులు ఉన్నారు. మేమే వీలైనప్పుడల్లా సేకరించి చదువుకొని ఒకరి అభిప్రాయాలు ఒకరు పంచుకొని నలుగురు ఐదుగురిని ఎంపిక చేస్తాం. కిరణ్ మధునాపంతుల, నేను ఒక నిర్ణయానికి వచ్చాక ప్రకటిస్తాం. కొందరు మిత్రులు 'ఫలానా రచయితలు మీ దృష్టికి వచ్చారా' అని అడిగినప్పుడు ఆ పుస్తకాలు మా దగ్గర లేకపోతే డబ్బు పంపి తెప్పించుకుని, చర్చించుకుని ఒక నిర్ణయానికి వస్తాం.

ఈ మధ్య మీరు ఈ ఆంధ్రీ కుటీరంలో ప్రారంభించి 'రత్నప్రభ' గ్రంథాలయం గురించి చెప్పండి? రత్న ప్రభా గ్రంథాలయం 2024 జనవరిలో ప్రారంభించాం. కవి, రచయిత మిత్రులు కొందరు వదాన్యులు ఇప్పటికీ 12 వేలకు పైగా పుస్తకాలు వితరణ చేశారు. ఈ గ్రంథాలన్నీ సంరంక్షించడానికి ఒక సువిశాలమైన గదిని, లైబ్రేరియన్‌ను ఏర్పాటు చేశాం. పరిశోధకులు, కవులు వస్తే వారు ఉండడానికి మంచి గది ఏర్పాటు చేశాం.

# 923 ఎకరాలను ఆక్రమణల నుంచి రక్షించాం: హైడ్రా కమిషనర్

మొదటిపేజీ తరువాయి

ఆరు చెరువులకు పూర్తిగా పునరుజ్జీవం కల్పించినట్లు వివరించారు. "గాజులరామారంలో కొందరు రౌడీషీటర్లు ప్రభుత్వ భూమిని ఆక్రమించారు. ఆదివారం అక్కడి ప్రభుత్వ భూమిలోని ఆక్రమణలనే తొలగించాం. ఇందులో నకిలీ పట్టాలు తీసుకుని నిర్మాణాలు చేపట్టారు. ప్రభుత్వ భూమిలోని 260 నిర్మాణాలను తొలగించాం. ప్రస్తుతం 51 డీఆర్ఎఫ్ బృందాలు ఉన్నాయి. త్వరలోనే 72కు పెంచుతాం. నగరంలో 150 మాన్‌సూన్ ఎమర్జెన్సీ టీమ్స్ ఉన్నాయి. నాలాల వద్ద ఆక్రమణలు గుర్తించి తొలగిస్తున్నాం. వాటిలో పూడిక తొలగింపును ముమ్మరం చేశాం. వర్షం నీరు చెరువుల్లోకి వెళ్లే పరిస్థితి, నీరు నిల్వ చేసే పరిస్థితి లేదు. కాంక్రీటైజేషన్ వల్ల వర్షపు నీరు భూమిలోకి ఇంకడం లేదు. అధిక కాలుష్యం వల్ల నగరాల్లోనే వర్షాలు ఎక్కువగా కురుస్తున్నాయి. భవిష్యత్ అంతా యువతరానిదే కాబట్టి పార్కులు, చెరువుల గురించి జన్ జడ్ ఆలోచించాలి" అని రంగనాథ్ సూచించారు.

# విజయవాడ ఉత్సవ్‌కు తొలగిన అడ్డంకి

## దేవాలయ భూముల వినియోగంపై పిటిషన్ డిస్మిస్

మొదటిపేజీ తరువాయి

విజయవాడ ఉత్సవ్‌కు ఆటంకం తొలగింది. ఉత్సవ్ నిర్వహణకు ఆలయ భూములు వినియోగిస్తున్నారంటూ దాఖలైన పిటిషన్‌ను సుప్రీంకోర్టు డిస్మిస్ చేసింది. వ్యవసాయ భూములైతే రాష్ట్ర ప్రభుత్వం, సంబంధిత ఆలయ అధికారులు చూసుకుంటారని జస్టిస్ విక్రమ్‌నాథ్ నేతృత్వంలోని ధర్మాసనం వ్యాఖ్యానించింది. మూడో వ్యక్తికి అభ్యంతరాలు ఏంటని అసహనం వ్యక్తం

చేసింది. ఆలయ భూములను కమర్షియల్‌గా వినియోగిస్తున్నారంటూ పిటిషనర్ తరఫు న్యాయవాది వాదించారు. వ్యవసాయ భూములను ఎగ్జిబిషన్ పేరుతో వాడటం నిబంధనలకు విరుద్ధమన్నారు. దీనిపై ప్రభుత్వం తరఫు న్యాయవాది ఆదినారాయణ వాదనలు వినిపిస్తూ ఆ భూములను చాలా కాలం క్రితమే ప్రైవేటు- వ్యక్తి లీజుకు తీసుకున్నారని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఆ భూములతో పిటిషనర్‌కు నేరుగా ఏదైనా సంబంధం ఉందా? అని జస్టిస్ విక్రమ్‌నాథ్ ధర్మాసనం ప్రశ్నించింది. ఎవరికీ సమస్యలు లేవని.. కలెక్టర్ నేతృత్వంలో ఏర్పాటైన సొసైటీ ఆ భూముల నిర్వహణ చూస్తోందని ఆదినారాయణ తెలిపారు. కార్యక్రమ నిర్వహణకు 56 రోజులకు రూ.45లక్షలు దేవాదాయశాఖకు చెల్లించారని పేర్కొంది. భక్తుల పేరుతో అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ పిటిషన్ దాఖలు చేశారన్నారు. విజయవాడ ఉత్సవ్‌ను నిలిపేందుకు రాజకీయ కారణాలతోనే పిటిషన్ వేశారని చెప్పారు. వ్యవసాయ భూములైతే రాష్ట్ర ప్రభుత్వం, సంబంధిత ఆలయ అధికారులు చూసుకుంటారని.. మూడో వ్యక్తికి అభ్యంతరాలు ఏంటని ధర్మాసనం అసహనం వ్యక్తం చేసింది. ఇంకా ఏమైనా ఉంటే హైకోర్టు చూసుకుంటుందని జస్టిస్ విక్రమ్‌నాథ్ అన్నారు. హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులపై జోక్యానికి విషయమేమీ కనిపించడం లేదని పేర్కొంటూ పిటిషన్‌ను ధర్మాసనం డిస్మిస్ చేసింది.

# మనవాళలకు ఆటంకంగా మారిన అమెరికా విధానాలు

మొదటిపేజీ తరువాయి

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అమెరికాతో దౌత్య సంబంధాల్లో కేంద్ర ప్రభుత్వం విఫలమైంది అని ఆరోపించారు. ప్రస్తుత పరిస్థితుల్లో అమెరికా దేశానికి సంబంధించిన నియమ నిబంధనలు మనవాళ్లు చదువుకోవడానికి ఉద్యోగాలు చేయడానికి ఆటంకంగా ఉన్నాయని పేర్కొన్నారు. ఇక, మన దేశానికి సంబంధించి 100 మంది సీఈఓలు ఇతర దేశాల్లో ఉన్నారు అని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. వారి తెలివి తేటలను మన దేశంలో పెట్టాలని కోరుతున్నాను.. ఇక్కడి ప్రభుత్వాలు రెడ్ కార్పెట్ వేసి కంపెనీలకు స్వాగతం పలుకుతున్నాయి. ఇక, విదేశాల్లో ఉన్న తెలంగాణ వారంతా తెలంగాణలో పెట్టు-బడులు పెట్టాలి అని కోరారు. గ్రామీణ ప్రాంతాలను పారిశ్రామికంగా సాంకేతికంగా అభివృద్ధి చేయాలని విజ్ఞప్తి చేస్తున్నాను అని పొన్నం ప్రభాకర్ చెప్పారు.

# విమానం గాల్లో ఉండగా.. కాక్‌పిట్ డోర్ తెరవబోయిన ప్రయాణికుడు

మొదటిపేజీ తరువాయి

విమానం గాల్లో ప్రయాణిస్తున్న సమయంలో దాని కాక్‌పిట్‌లోకి చొరబడేందుకు ఓ ప్రయాణికుడు తీవ్రంగా యత్నించాడు. ఈ ఘటన బెంగళూరు నుంచి వారణాశికి ప్రయాణిస్తున్న ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ IX-1086 విమానంలో చోటు చేసుకొంది. ఉదయం 8 గంటల సమయంలో విమానం గాల్లో ఉండగా.. ఓ ప్రయాణికుడు పైలట్లు ఉండే కాక్‌పిట్‌లో చొరబడాలని తీవ్రంగా యత్నించాడు. కానీ, సాధ్యం కాలేదు. వెంటనే స్పందించిన సిబ్బంది.. అతడిని సీటులో కూర్చొబెట్టారు. విమానం వారణాశిలో దిగిన తర్వాత సీఐఎస్ఎఫ్ సిబ్బందికి అతడిని అప్పజెప్పారు.

వాస్తవానికి కాక్‌పిట్‌లో ప్రవేశించే డోర్‌ను తెరవాలంటే ఓ ప్రత్యేకమైన పాస్‌కోడ్ ఉంటుంది. దానిని ఎంటర్ చేశాక కూడా.. సదరు వ్యక్తి కెప్టెన్ నిర్ణయం ఆధారంగానే లోపలికి ప్రవేశించగలడు.

ఈ ఘటనపై ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ ప్రత్యేకంగా స్పందించలేదు. కాకపోతే ప్రయాణికుల భద్రత విషయంలో ఏమాత్రం రాజీపడమని పేర్కొంది. సదరు ఘటనకు సంబంధించిన రిపోర్టులు తమ దృష్టికి వచ్చాయని పేర్కొంది. సదరు ప్రయాణికుడు మరుగుదొడ్డి కోసం వెతుకుతూ కాక్‌పిట్ వద్దకు వెళ్లాడని వెల్లడించింది. ఈ ఘటనను సంబంధింత అధికారుల దృష్టికి తీసుకెళ్లామని వెల్లడించింది.

# అహ్మదాబాద్ విమాన ప్రమాదంపై ప్రాథమిక నివేదిక

మొదటిపేజీ తరువాయి

జూన్ నెలలో అహ్మదాబాద్‌లో ఘోర విమాన ప్రమాదం జరిగింది. విమానం టేకాఫ్ అయ్యాక సెకన్ల వ్యవధిలో ఇంధన కంట్రోల్ స్విచ్‌లు ఆగిపోయినట్లు- ఏఏఐబీ నివేదికను సమర్పించింది. ఆ స్విచ్ ఎందుకు ఆఫ్ చేశావని ఒక పైలట్.. మరో పైలట్‌ను ప్రశ్నించాడని రిపోర్ట్‌లో పేర్కొంది. తాను స్విచ్ ఆఫ్ చేయలేదని మరో పైలట్ సమాధానం ఇచ్చినట్లు తెలిపింది. కాక్‌పిట్‌లో ఇవే పైలట్ల ఆఖరి మాటలని ఏఏఐబీ వెల్లడించింది. ఈ రెండు స్విచ్‌లు ఒక సెకను తేడాతో ఒకదాని తర్వాత మరొకటి ఆగినట్లు- ఆ నివేదికలో వివరించింది. దర్యాప్తు కొనసాగుతోందని.. ప్రమాదానికి మూల కారణాలు, సిఫార్సులతో తుది నివేదికను విడుదల చేస్తామని తెలిపింది. ఆ తర్వాత అంతర్జాతీయ మీడియాలో వచ్చిన కథనాలు దిగ్భ్రాంతిని కలిగించాయి. ఎయిరిండియా విమానం పైలటే ఇంధన స్విచ్‌ను షట్‌డౌన్ చేశారంటూ ఊహాజనిత వార్తలు ప్రచురించాయి. దర్యాప్తు కొనసాగుతోన్న దశలో ఇటు-వంటి చర్యలు బాధ్యతారాహిత్యంతో కూడినవని అప్పట్లో ఏఏఐబీ ఖండించింది. ఈనేపథ్యంలో స్వతంత్ర దర్యాప్తు కోసం పిటిషనర్ల తరఫు న్యాయవాది వాదించారు. అసలు ఏం జరిగిందో గుర్తించేందుకు ÷-లఫైట్ డేటా రికార్డర్‌ను పరిశీలించేందుకు నిపుణులను అనుమతించాలని కోరారు. దీనిపై సుప్రీం ధర్మాసనం స్పందించింది.న్యాయపరమైన, నిష్పాక్షిక దర్యాప్తు వరకు చూసుకుంటే అది ముఖ్యమే. కానీ ఆ వివరాలన్నీ బహిర్గతం చేస్తే.. పాడ్‌కాస్టుల్లో కొత్త సిద్ధాంతాలు అల్లేస్తారు. ఎవరైనా బాధ్యతారహితంగా పైలట్‌ది తప్పు అని చెప్తే.. అది ఆ కుటుంబంపై ఎంతో ప్రభావం చూపుతుంది. ఒకవేళ.. తుది నివేదికలో ఆ పైలట్ పేరు లేకపోతే.. అప్పుడు ఏం చేస్తాం అని ప్రశ్నించింది.

# సింగరేణి కార్మికులకు బోనస్ ప్రకటించిన తెలంగాణ ప్రభుత్వం

మొదటిపేజీ తరువాయి

హైదరాబాద్: దసరా సందర్భంగా సింగరేణి కార్మికులకు తెలంగాణ ప్రభుత్వం బోనస్ ప్రకటించింది. లాభాల్లో 34 శాతం కార్మికులకు పంచాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వెల్లడించారు. ఒక్కో కార్మికుడికి బోనస్‌గా రూ.1,95,610 ఇవ్వనున్నట్లు తెలిపారు. హైదరాబాద్‌లో పలువురు మంత్రులతో కలిసి నిర్వహించిన మీడియా సమావేశంలో ఈ మేరకు వెల్లడించారు. కాంట్రాక్ట్ కార్మికులకూ బోనస్ చెల్లిస్తామని భట్టి తెలిపారు. కాంట్రాక్ట్ కార్మికులకు బోనస్ ఇవ్వడం దేశ చరిత్రలోనే తొలిసారని చెప్పారు.

"సింగరేణి సంస్థలోని 41వేల మంది శాశ్వత ఉద్యోగులకు మొత్తంగా రూ.819 కోట్లు బోనస్‌గా పంపిణీ చేస్తాం. 30వేల మంది కాంట్రాక్ట్ ఉద్యోగులకూ రూ.5,500 చొప్పున అందజేస్తాం. కోల్ ఇండియా నుంచి వచ్చే బోనస్‌ను దీపావళికి పంపిణీ చేస్తాం. భవిష్యత్‌లోనూ సింగరేణి కార్మికులకు అండగా ఉంటాం. జీఎస్టీ మార్పుల వల్ల రాష్ట్రాలు ఆదాయం కోల్పోతున్నాయి. కోల్పోతున్న ఆదాయాన్ని కేంద్రం భర్తీ చేయాలి. ఏకపక్షంగా నిర్ణయం తీసుకుని రాష్ట్రాలపై భారం వేయడం సరికాదు. వచ్చే ఐదేళ్లపాటు కేంద్రం వయబులిటీ గ్యాప్ ఫండ్ ఇవ్వాలి" అని రేవంత్‌రెడ్డి అన్నారు.

# కారు పార్టీ అక్రమంగా తెచ్చిన లగ్జరీ కార్లపై నడుస్తోందా?: బండి సంజయ్

మొదటిపేజీ తరువాయి

హైదరాబాద్: కారు పార్టీ అక్రమంగా తెచ్చిన లగ్జరీ కార్లపై నడుస్తోందా? అని కేంద్ర మంత్రి బండి సంజయ్ ప్రశ్నించారు. ఈమేరకు ఆయన 'ఎక్స్' వేదికగా పోస్టు చేశారు. "లగ్జరీ కారు స్కామ్ నిందితుడు బసరత్ ఖాన్ దిగుమతి చేసిన ల్యాండ్ క్రూజర్లలో కేటీఆర్ ఎందుకు తిరుగుతున్నారు? ఆ కార్లు కేసీఆర్ కుటుంబానికి సంబంధించిన కంపెనీల పేర్లతో ఎందుకు రిజిస్టర్ అయ్యాయి? మార్కెట్ ధర చెల్లించారా? లేదా తక్కువగా చూపించి కొనుగోలు జరిగిందా? పేమెంట్లు బినామీ పేర్లతో జరిగాయా? నకిలీ ఆదాయమా? లేదా మనీలాండరింగ్ ద్వారానా? ఈ స్కామ్‌లో కేసీఆర్ కుటుంబం నేరుగా ప్రయోజనం పొందినట్లు అనుమానించాల్సి వస్తోంది. వాస్తవాలు బయటకు రావాలి.. సంబంధిత శాఖలు దర్యాప్తు చేయాలి" అని బండి సంజయ్ అన్నారు.

# హైదరాబాద్‌లో భారీ వర్షం.. పలు చోట్ల ట్రాఫిక్ జామ్

మొదటిపేజీ తరువాయి

ఖైరతాబాద్-రాజ్‌భవన్ రోడ్డులో మోకాలి లోతు నీరు నిలిచి పోవడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. అమీర్‌పేట, పంజాగుట్ట, ఖైరతాబాద్ ప్రాంతాల్లో ట్రాఫిక్ జామ్ అయింది. వరద నీరు నిలిచిన ప్రాంతాల్లో హైడ్రా, జీహెచ్ఎంసీ సిబ్బంది సహాయక చర్యలు చేపట్టారు.

**పలు జిల్లాలకు ఎల్లో హెచ్చరిక**

ఉత్తర ఈశాన్య బంగాళాఖాతంలో కొనసాగుతున్న ఉపరితల ఆవర్తన ప్రభావంతో ఇవాళ ఉదయం అదే ప్రాంతంలో అల్పపీడనం ఏర్పడినట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రకటించింది. రాగల 24 గంటల్లో ఈ అల్పపీడనం పశ్చిమ వాయువ్య దిశలో కదిలి వాయువ్య బంగాళాఖాతం ప్రాంతానికి చేరుకునే అవకాశం ఉందని వెల్లడించింది. అల్పపీడనం ప్రభావంతో రాష్ట్రంలో సోమవారం, మంగళవారం ఉరుములు మెరుపులతో కూడిన భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అధికారి శ్రీనివాసరావు తెలిపారు. పలు జిల్లాలకు ఎల్లో హెచ్చరికలు జారీ చేశామన్నారు. ఈనెల 25న ఉత్తర బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని.. దీని ప్రభావంతో 25, 26 తేదీల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపారు.

# మీ సమస్య పరిష్కరించకుంటే స్థానిక ఎన్నికలు బహిష్కరించండి: కేటీఆర్

మొదటిపేజీ తరువాయి

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మీ సమస్య పరిష్కరించకపోతే త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికలు బహిష్కరించాలని సూచించారు. స్థానిక ఎన్నికలు బహిష్కరించడం వల్ల మీ సమస్య దిల్లీకి వెళ్తుంది. అసెంబ్లీలో మాకు మైక్ ఇవ్వట్లేదు. మైక్ ఇచ్చేందుకు కూడా ప్రభుత్వం భయపడుతోంది. కత్తి వాళ్ల చేతిలో పెట్టారు.. మమ్మల్ని యుద్ధం చేయమంటున్నారు. కాంగ్రెస్ నేతల భూముల్లో రోడ్డు వెళ్లకుండా అలైన్‌మెంట్ మార్చడం కొత్తేంకాదు. గతంలో ఔటర్ రింగ్ రోడ్డు వేసినప్పుడు కూడా అష్ట వంకర్లు తిప్పారు. గతంలో ఓఆర్ఆర్‌కు భూసేకరణ సమయంలో భూమికి బదులు భూమి ఇచ్చారు. ట్రిపుల్ ఆర్ వల్ల భూమి కోల్పోతున్న రైతులకు భూమి కావాలంటే పోరాటం చేయొచ్చు. అలైన్‌మెంట్ శాస్త్రీయంగా ఉండాలని ఉద్యమం చేద్దాం" అని కేటీఆర్ అన్నారు. ఈ సమావేశంలో పార్టీ నేతలు జగదీశ్‌రెడ్డి, కర్నె ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

# చినూరు గ్రామంలో దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ప్రారంభం...

దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు నాగిరెడ్డిపేట మండలం చీనురు గ్రామంలో సోమవారం అత్యంత ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ ఉత్సవాలు భక్తులను ఆధ్యాత్మిక ఆనందంతో నింపాయి. మొదటి రోజు అమ్మవారు శ్రీ బాల త్రిపురసుందరి దేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం పండితులు వేద మంత్రాల మధ్య అమ్మవారి ప్రతిష్ఠాపన చేశారు. అభిషేకాలు,అలంకరణలతో పాటు ప్రత్యేక పూజలు నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమం భక్తుల మధ్య ఉత్సాహాన్ని నింపి, ఆలయ ప్రాంగణాన్ని శక్తి స్వరూపంగా మార్చింది. శరన్నవరాత్రి ఉత్సవాలు ఈ ఏడాది పదకొండు రోజుల పాటు కొనసాగనున్నాయని, ప్రతి రోజు అమ్మవారు విభిన్న అవతారాల్లో దర్శనమిస్తారని నిర్వాహకులు తెలిపారు. ఈ ఉత్సవాలను సజావుగా నిర్వహించడంలో కీలక పాత్ర పోషించారు. ఈ



సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ... హిందూ సంస్కృతిని పరిరక్షించడం, యువతను ఆధ్యాత్మిక మార్గంలో ప్రేరేపించడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. భక్తులు ఈ ఉత్సవాలకు పెద్ద ఎత్తున తరలివచ్చి, అమ్మవారి ఆశీస్సులు పొందారు. ఈ కార్యక్రమంలో గ్రామంలోని యువకులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు. అనంతరం విగ్రహదాత గంపల వెంకన్న ను గ్రామ పెద్దలు, యువకులు సన్మానించారు.

కరపత్రం
తెలుగు దిన పత్రిక
మంగళవారం సెప్టెంబర్ 23 2025

# మేడ్చల్ లో భారీ వర్షం

- చెరువులను తలపిస్తున్న రోడ్లు



**కరుణాకర్ మల్లిగారి, కరపత్రం ప్రతినిధి**
మేడ్చల్ మున్సిపల్ పట్టణ కేంద్రంలో బుధవారం సాయంత్రం కురిసిన భారీ వర్షానికి పట్టణంలోని ప్రధాన రహదారులు చెరువులను తలపిస్తున్నాయి. లోతట్టు ప్రాంతాల సంగతి అటుంచితే, ప్రధాన రోడ్లు కూడా వాహనాలు, ప్రయాణికులు వెళ్లడానికి వీలులేకుండా మారాయని వాహనదారులు వాపోతున్నారు. ముఖ్యంగా ఇంద్ర నగర్ కాలనీ వద్ద తేలికపాటి వర్షానికే రోడ్లు చెరువులను తలపిస్తున్నాయని, ఈ సమస్యను పరిష్కరించాలని కాలనీవాసులు మున్సిపల్ అధికారులను కోరుతున్నారు.

# మహిళలతో కలిసి
## బతుకమ్మ ఆడిన మల్లారెడ్డి



**కరుణాకర్ మల్లిగారి, కరపత్రం ప్రతినిధి**
హైదరాబాద్ నగరంలో బతుకమ్మ వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. మేడ్చల్ జిల్లా పిర్జాది గూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో వర్షం ఆటంకం కలిగించినప్పటికీ, మహిళలు బతుకమ్మ ఆడుతున్నారు. మాజీ మంత్రి, మేడ్చల్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే మల్లారెడ్డి మహిళలతో కలిసి బతుకమ్మ ఆడి, వారిలో ఉత్సాహం నింపారు.

## పొన్నాల గ్రామంలో పులి సంచారం

- కలకలం రేపుతున్న పులి అడుగులు



**కరుణాకర్ మల్లిగారి, కరపత్రం ప్రతినిధి**
మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా శామీర్పేట్ మండలం పొన్నాల గ్రామంలోని పంట పొలాల్లో పులి సంచారం కలకలం రేపింది. రెండు మూడు రోజుల నుంచి పులి అడుగులు కనిపిస్తున్నాయని గ్రామస్థులు తెలిపారు. ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరగక ముందే అటవీ అధికారులు స్పందించాలని వారు కోరుతున్నారు. కొందరు అవి పులి అడుగులని, మరికొందరు చిరుతపులి అడుగులని అంటున్నారు. ఏదేమైనా అధికారులు తమ గ్రామానికి రావాలని గ్రామస్థులు విజ్ఞప్తి చేస్తున్నారు.

# పార్టీ ఇవ్వాలంటూ కొట్టడంతో
# తోటి విద్యార్థి మృతి

- అదుపు తప్పుతున్న రాగింగ్



**కరుణాకర్ మల్లిగారి, కరపత్రం ప్రతినిధి**
మేడ్చల్ జిల్లా మేడిపల్లి పీఎస్ నారపల్లిలోని సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీలో బీటెక్ సెకండియర్ చదువుతున్న సాయితేజ అనే విద్యార్థి, సీనియర్ విద్యార్థుల ఒత్తిడితో పార్టీ ఇవ్వలేక తీవ్రంగా కొట్టడంతో మరణించాడని అతని తండ్రి ప్రేమ్ సింగ్ నాయక్ ఆరోపించారు. కాలేజీలో జరిగిన గొడవకు సంబంధించి కాంప్రమైజ్ అవ్వడానికి పార్టీ ఇవ్వాలని సీనియర్లు ఒత్తిడి తెచ్చారని, ఈ వేధింపుల వల్లే తన కుమారుడు మరణించాడని, న్యాయం చేయాలని మృతుడి కుటుంబ సభ్యులు డిమాండ్ చేస్తున్నారు.

## వయో వృద్ధుల కేసుల పరిష్కార అధికారి
## ప్రభాకర్ రావు ఆకస్మిక మృతి



**గాజెంగి మహేశ్వర్, కరపత్రం మెటుపల్లి**
జగిత్యాల జిల్లా మెట్ పల్లి పట్టణంలో సోమవారం, వయో వృద్ధుల కేసుల పరిష్కారానికి ప్రభుత్వం నియమించిన కౌన్సిలింగ్ అధికారి వెల్మల ప్రభాకర్ రావు (ఈ నెల 20న) ఆకస్మిక మృతికి తెలంగాణ ఆల్ సీనియర్ సిటీజేన్స్ అసోసియేషన్ జగిత్యాల జిల్లా శాఖ సంతాపం తెలిపింది. సంఘ కార్యాలయంలో నిర్వహించిన సంతాప సమావేశంలో జిల్లా అధ్యక్షుడు హరి ఆశోక్ కుమార్ మాట్లాడుతూ, ప్రభాకర్ రావు మెట్ పల్లి డివిజన్ కోశాధికారిగా, కౌన్సెలింగ్ అధికారిగా నిరాదరణకు గురవుతున్న వృద్ధుల కేసుల పరిష్కారానికి కృషి చేశారని కొనియాడారు.

## ఇంజినీరింగ్ విద్యార్థి బలవన్మరణం



**కరుణాకర్ మల్లిగారి, కరపత్రం ప్రతినిధి**
మేడ్చల్ జిల్లాలోని నారపల్లిలో విషాద ఘటన చోటు చేసుకుంది. కాలేజీ హాస్టల్ గదిలో ఇంజినీరింగ్ విద్యార్థి సాయితేజ సీనియర్ల ర్యాగింగ్ తట్టుకోలేక ఆత్మహత్య చేసుకున్నాడు. సీనియర్లు అతడితో బలవంతంగా మద్యం తాగించి బార్‌లో రూ.10వేల బిల్లు కట్టాలని సాయితేజను ఒత్తిడి చేశారు. దీంతో అతడు మనస్తాపానికి గురై ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని విచారణ జరుపుతున్నారు.

## భరత్ నగర్ లో బతుకమ్మ వేడుక



- ఘనంగా ఆడిన మహిళలు

**కరుణాకర్ మల్లిగారి, కరపత్రం ప్రతినిధి**
మేడ్చల్ జిల్లా రాంపల్లి భరత్ నగర్ కాలనీలో ఎంగిలి పూల బతుకమ్మ వేడుకను ఘనంగా నిర్వహించారు. ప్రకృతిని ఆరాధించే ఈ సాంప్రదాయ పండుగలో మహిళలు, చిన్నారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. తీరొక్క పువ్వులను చేర్చి, ఐక్యతను చాటే ఈ పర్వదినం ఆనందంగా సాగింది. సాంప్రదాయ వేషధారణలో మహిళలు, బాలికలు నృత్యాలు, పాటలతో వేడుకను అందంగా మార్చారు. స్థానిక పెద్దలు, కాలనీ వాసులు ఈ పండుగను విజయవంతం చేశారు.

# ప్రభుత్వానికి వ్యతిరేకంగా
# బతుకమ్మ ఆడిన మహిళలు

- రేవంత్ ప్రభుత్వాన్ని నిజాం తో పోల్చి నిరసన



**కరుణాకర్ మల్లిగారి, కరపత్రం ప్రతినిధి**
మేడ్చల్ జిల్లా గాజులరామారంలో ఆదివారం సర్వే నెంబర్లు 307, 342లలో భారీగా హైడ్రా కూల్చివేతలు చేపట్టారు. ఈ కూల్చివేతల్లో 200 మంది పోలీసులు, రెవెన్యూ, జీహెచ్ఎంసీ, హైడ్రా అధికారులు పాల్గొన్నారు. తమ ఇళ్లను కూల్చివేసిన ప్రభుత్వానికి వ్యతిరేకంగా మహిళలు బతుకమ్మ ఆడుతూ నిరసన తెలిపారు. ఈ సంఘటన బస్తీ వాసులకు జరిగిన అన్యాయాన్ని తెలియజేస్తూ బతుకమ్మ ఆడారు. తెలంగాణలో రేవంత్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వం నాటి నైజాం రాజ్యాన్ని తలపిస్తున్నదని, ప్రజలను పీడించిన రజాకార్లకు ఈ ప్రభుత్వానికి తేడా లేదని మహిళలు దుమ్మెత్తి పోసారు.

## సిరికొండలో దుర్గాదేవి నవరాత్రోత్సవాలు

- ఘనంగా ప్రారంభం



**కొండబత్తిని అమర్ నాథ్, కోరుట్ల ప్రతినిధి**
కథలాపూర్ మండలంలోని సిరికొండ గ్రామంలో సోమవారం దుర్గాదేవి నవరాత్రోత్సవాలు వైభవంగా మొదలయ్యాయి. హనుమాన్ ఆలయం నుంచి గ్రామంలో శోభాయాత్ర జరిగింది. శ్రీ సరస్వతి శిశు మందిర్ విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అనంతరం మంటపంలో ప్రత్యేక పూజలు చేసి దుర్గామాత విగ్రహాన్ని ప్రతిష్టించారు. భవానీ దీక్ష మాలాధారులు, మహిళలు, గ్రామస్తులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. దీంతో ఊరంతా పండుగ వాతావరణం నెలకొంది.

# సింహ వాహనాన్ని ఆలయానికి
# అందజేసిన దంపతులు



**గాజెంగి మహేశ్వర్, కరపత్రం మెటుపల్లి**
జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలంలోని వేములకుర్తి గ్రామంలోని అతి పురాతన శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో విజయదశమి బ్రహ్మోత్సవాల సందర్భంగా, స్వామివారి సేవ ఊరేగింపులో ఉపయోగించే సింహ వాహనాన్ని మాజీ దేవాలయ కమిటీ అధ్యక్షుడు పట్నం నర్సయ్య కుమారుడు పట్నం నరేష్ – అనుజా దంపతులు సోమవారం ఆలయానికి అందజేశారు. అర్చకులు శ్రీనివాసాచార్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

# దుర్గాదేవి ఆలయంలో
# హరీష్ రెడ్డి ప్రత్యేక పూజలు

**కోరుట్ల ప్రతినిది గోదావరిఖని సెప్టెంబర్ 22:**
శ్రీ దుర్గాదేవి శరన్నవరాత్రుల ఉత్సవాలలో భాగముగా గోదావరిఖని జవహర్ లాల్ నగర్ లోని దుర్గా దేవి ఆలయంలో టిఆర్ఎస్ నాయకులు, వీహెచ్ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు హరీష్ రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. రామగుండం ప్రజలు సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని అమ్మవారిని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ అధికార ప్రతినిధి ఎండి జాహిద్ పాష, మీర్ ఫయాజ్ అలీ, వీహెచ్ఆర్ ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి సిగిరి రాము, నడిపెల్లి సాయి, సార్ల ఉదయ్, వంశీ కృష్ణ, మహిపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మెట్ పల్లి కోర్టుల్లో మధ్యవర్తిత్వ కేంద్రాలు

- పెండింగ్ కేసులు పరిష్కారానికి మార్గం



**గాజెంగి మహేశ్వర్, కరపత్రం మెటుపల్లి**
మెట్ పల్లి పట్టణంలో సోమవారం కోర్టుల్లో మధ్యవర్తిత్వ కేంద్రాలు ఏర్పాటు చేయడం మంచి ఆలోచన అని మాజీ మున్సిపల్ ఛైర్ పర్సన్ రానవేణి సుజాత అన్నారు. స్థానిక మెట్ పల్లి కోర్టులో ఏర్పాటు కానున్న ఈ కేంద్రాల కోసం శిక్షణ పూర్తి చేసుకున్న న్యాయవాదులను ఆమె సన్మానించారు. రోజురోజుకి కోర్టుల్లో పెరుగుతున్న పెండింగ్ కేసులను పరిష్కరించడానికి మధ్యవర్తిత్వ కేంద్రాలు సత్ఫలితాలనిస్తాయని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు డాక్టర్ ఆర్.సత్యనారాయణ, అంగడి పురుషోత్తం కూడా పాల్గొన్నారు.

# త్వరలోనే ముత్యం పేట
# చక్కర ఫ్యాక్టరీని తెరుస్తాం



**గాజెంగి మహేశ్వర్, కరపత్రం మెటుపల్లి**
ముత్యంపేట నిజాం చక్కెర ఫ్యాక్టరీని పునఃప్రారంభించేందుకు అధికార కాంగ్రెస్ పార్టీ కృషి చేస్తుందని మాజీ మంత్రి జీవన్ రెడ్డి తెలిపారు. మెట్పల్లిలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఫ్యాక్టరీని తిరిగి తెరిపించడానికి కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని చర్యలు చేపడుతోందని పేర్కొన్నారు.బకాయి ఉన్న 170 కోట్లను ప్రభుత్వం చెల్లించిందని, చక్కెర ఫ్యాక్టరీల పరిశీలనకు ఈనెల 26న రాష్ట్ర వ్యవసాయశాఖ సెక్రెటరీ మరియు ఉన్నతాధికారులు వస్తున్నారని ఆయన అన్నారు.
ఈ కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ నాయకులు జువ్వాడి కృష్ణారావు, అల్లూరి మహేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వేడుకగా దుర్గాదేవి శరన్నవరాత్రి
# ఉత్సవాలు ప్రారంభం



**గాజెంగి మహేశ్వర్, కరపత్రం ప్రతినిధి**
జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలంలోని పలు గ్రామాలలో సోమవారం దుర్గాదేవి శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవ కమిటీ సభ్యులు, భవాని దీక్ష భక్తులు అమ్మవారిని గ్రామాలలో ఎదుర్కొని ఆగమన యాత్ర నిర్వహించారు. ప్రత్యేక మండపాలలో అమ్మవారిని కొలువుదీర్చి, పలువురు భవాని దీక్షలు స్వీకరించారు. అర్చకుల వేదమంత్రోచ్చరణల మధ్య అమ్మవారికి పంచామృత అభిషేకాలు, అష్టోత్తర పూజలు నిర్వహించి, భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు. మొదటి రోజు అమ్మవారు బాలత్రిపుర సుందరిగా భక్తులకు దర్శనమిచ్చారు.

# అయిలాపూర్ లో అనంత
# పద్మానాభ స్వామి సేవ

- ఘనంగా ఊరేగింపు



**కొండబత్తిని అమర్ నాథ్, కోరుట్ల ప్రతినిధి**
కోరుట్ల సమీపంలోని అయిలాపూర్ గ్రామంలో నవరాత్రుల సందర్భంగా శ్రీ అనంత పద్మానాభ స్వామి శేవా (ప్లలకి) ఊరేగింపు కార్యక్రమం మొదటి రోజు అత్యంత వైభవంగా జరిగింది. ఆలయ ప్రధానార్చకుల ఆధ్వర్యంలో మంగళవాయిద్యాల నడుమ స్వామి వారిని ఊరేగింపుగా తీసుకువచ్చి భక్తులకు సూర్య, చంద్రుల రూపంలో దర్శనమిచ్చారు. మహిళలు భక్తిశ్రద్ధలతో మంగళహారతులతో పాల్గొని స్వామి దివ్యరూపాన్ని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో గంగపుత్ర సంఘం సభ్యులు స్వామి వారి శేవా ఊరేగింపును ఘనంగా నిర్వహించారు.

## జిఎస్టి తగ్గింపు పై బిజెపి నాయకుల హర్షం.



**కోరుట్ల ప్రతినిధి కరీంనగర్ సెప్టెంబర్ 22**
వస్తు సేవలపై పన్నును (జీఎస్టీ)తగ్గించడంపై వినియోగదారులు వ్యాపారాలు ,బిజెపి నాయకులు హర్షం వ్యక్తం చేశారు.వస్తు సేవల పన్ను తగ్గింపు అమలగుచున్న సందర్భంగా సోమవారం బిజెపి నాయకులు జాడి బాల్ రెడ్డి , నరహరి లక్ష్మారెడ్డి, కిరాణా షాపులు, టీవీ షో రూమ్ , బుక్ స్టాల్, మెడికల్ స్టోర్, సందర్శించి వినియోగదారులతో మాట్లాడారు . నిరుపేద,మధ్యతరగతి వర్గాలకు సంబంధించిన నిత్యావసర వస్తువులపై జీఎస్టీని పూర్తిగా తగ్గించడం పై వినియోగదారులుహర్షం వ్యక్తం చేశారు. జీఎస్టీ ని తగ్గించడంపై వ్యాపారులు తమ వ్యాపారం ఇంకా అభివృద్ధి చెందుతుందని తెలిపారు.వీరి వెంట వెస్ట్ జోన్ నాయకులు గంటల నరసింహారెడ్డి, ఈ రెడ్డి తిరుమలరెడ్డి, నాంపల్లి శంకర్, జాడి అశోక్ వున్నారు

# చంద్రప్రభ వాహనంపై శ్రీవారు





**కోరుట్ల, కోరుట్ల ప్రతినిది**
దసరా ఉత్సవాల్లో భాగంగా పట్టణంలోని పురాతన దేవాలయమైన శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు సోమవారం చేపట్టారు. ఈ వేడుకల్లో భాగంగా శ్రీవారు "చంద్రప్రభ" వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. కాగా పట్టణంలోని పుర వీధుల్లో ఊరేగింపుగా తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జువ్వాడి కృష్ణారావు, ఆలయ కమిటి అధ్యక్షుడు ఎతిరాజాం నర్సయ్య, ఆలయ అర్చకులు బీర్నంది నర్సింహాచారి, కమిటి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.అష్టలక్ష్మి దేవాలయంలో.......పట్టణలోంని శ్రీ అష్టలక్ష్మి సహిత
శ్రీ లక్ష్మీ నారాయణ స్వామి దేవాలయంలో దసరా ఉత్సవాలు సోమవారం ప్రారంభమయ్యాయి.ఈ సందర్భంగా స్వామివారికి పంచామృతాలతో అభిషేకాలు, ప్రత్యేక పూజలు సముద్రాల శ్రీరామా చార్యుల వైదిక నిర్వహణలో చేపట్టారు. ఈ వేడుకల్లో భాగంగా స్వామి వారు గరుడ వాహనంపై భక్తులకు దర్శమిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వహకులు బూరుగు రామస్వామి గౌడ్, ఎలిశెట్టి భూమారెడ్డి, ముత్యాల గంగాధర్, ఇల్లెందుల వెంకట్రాములు, పడాల వెంకటేశ్వరరావు, చౌటుకురి అంజయ్య, చిలుక గంగాధర్, భూమయ్య, మహేష్, ఆలయ ప్రధానార్చకులు ఇందుర్తి మధుసూదనాచారి, శ్రీ పేరంబదూరి శ్రీనివాసచారి, యజ్ఞాచార్యులు సముద్రాల శ్రీరామాచార్యులు, భక్తులు పాల్గొన్నారు.

# కళాకారులను ప్రోత్సహించడం హర్షనీయం

- రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరు కంటి చందర్
- యైటీంక్లయిన్ కాలనీ కోరుట్ల ప్రతినిది
- రామగుండం పారిశ్రామిక ప్రాంత





కళాకారులను వసుంధర విజ్ఞాన వికాస మండలి వ్యవస్థాపక అధ్యక్షుడు మధుధర్మారెడ్డి ప్రోత్సహించడం హర్షనీయమని రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరు కంటి చందర్ అన్నారు. ఈ మేరకు హైదరాబాదులో సోమవారం రవీంద్ర భారతి లో తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ తెలంగాణ సాహిత్య అకాడమీ సౌజన్యంతో అంతర్జాతీయ వేదికలపై తెలంగాణ భాష సదస్సు జాతీయ స్ఫూర్తి పురస్కారాలను చందర్ తెలంగాణ ఆశ సాంస్కృతిక శాఖ డైరెక్టర్ ఏనుగు నరసింహారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై ప్రశంసా పత్రాలతోపాటు మోమొంటోలను అందజేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ మాట్లాడుతూ... తెలంగాణ భాష యావత్ ప్రపంచంలోనే ప్రత్యేక గుర్తింపు ఉన్నటువంటి ఆయన పేర్కొన్నారు. ప్రపంచ దేశాల్లో మన తెలుగు వారికి ఉన్న గౌరవం ఏ దేశానికి లేదని అలాగే తెలుగు భాషను తెలంగాణ యాసను ప్రతి ఒక్కరు గౌరవిస్తారని ఆయన అన్నారు. అలాగే వివిధ రంగాల్లో రాణిస్తున్న వారిని మధు ధర్మారెడ్డి చేరదీసి వారికి పురస్కారాలు ఇవ్వడం ఆనందంగా ఉందన్నారు. కొత్తగా ఏర్పడ్డ తెలంగాణ రాష్ట్రంలో తెలంగాణ భాష కోసం వసుంధర విజ్ఞాన వికాస మండలి వారు ఎంతో కృషి చేస్తున్నారన్నారు. రానున్న రోజుల్లో మన తెలుగు కళాకారులను గుర్తించి ప్రోత్సహించడం అనేది గొప్ప కార్యక్రమమన్నారు. బొగ్గు గనుల ప్రాంతం నుండి నేడు రాజధాని నడి ఒడ్డున అవార్డులు ప్రధానం చేయడం గర్వించదగ్గ విషయమని అన్నారు. ఈ కార్యక్రమంలో వసుంధర విజ్ఞాన వికాస మండలి సభ్యులు, అవార్డు గ్రహీతలు పాల్గొన్నారు.

# నేలకు ఒరిగిన మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న వ్యవసాయ శాఖ అధికారి అనిల్

- నేలకు ఒరిగిన మొక్కజొన్న పంటను క్షేత్రస్థాయిలో పరిశీలించిన వ్యవసాయ అధికారి.
  ఏవో కే అనిల్ కుమార్.
- పంట నష్టం వివరాలను నమోదు చేసి పైస్థాయికి పంపుతామని రైతులకు భరోసా ఇచ్చిన అధికారులు.





**ఆళ్లపల్లి కోరుట్ల ప్రతినిది**
ఆళ్లపల్లి మండల కేంద్రంలోని రామానుజగూడెం, తునికిబండ్ల, కర్ణేగూడెం, మార్కోడు గ్రామాల్లో, శనివారం మరియు ఆదివారం కురిసిన భారీ వర్షాల కారణంగా మొక్కజొన్న పంటలు నేలకు ఒరిగిపోయాయని రైతులు చేసిన ఫిర్యాదుల మేరకు వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో సందర్శించారు.
ఈ సందర్భంగా వ్యవసాయ విస్తరణాధికారి రావూరి విజయ వంశీ, బోడ విజయ్ మండల వ్యవసాయ అధికారి కె అనిల్ కుమార్ ప్రభావిత గ్రామాలను సందర్శించి, మొక్కజొన్న పంటలను ప్రత్యక్షంగా పరిశీలించారు. పరిశీలన సందర్భంగా రైతులతో మాట్లాడి పంటల ప్రస్తుత పరిస్థితులను తెలుసుకొని పంట నష్టాల వివరాలు నమోదు చేసి పైస్థాయి అధికారులకు పంపిస్తామని తెలిపారు. వర్షం కారణంగా నేల తడిసిపోవడం, మొక్కలు కూలిపోవడం వలన దిగుబడి తగ్గే అవకాశం ఉందని వివరించారు. రైతులు తక్షణం అనుసరించవలసిన పంట సంరక్షణ చర్యలపై సూచనలు అందించారు. ఇంకా పరిశీలించాల్సిన మొక్కజొన్న పంట ఉంటే సంబంధిత రైతులు సమాచారం ఇస్తే, వాటిని కూడా పరిశీలిస్తామని తెలిపారు.అలాగే వర్షాల ప్రభావంతో నేలవాలిన మొక్కజొన్న పంటను పైకి ఎత్తి కట్టుకోవాలి, ఎండిన కంకులకు చదలు పట్టకుండా విరిచి ఆరబెట్టుకోవాలని రైతులకు సూచించారు.

# పూర్వ ప్రాథమిక విద్య, పోషకాహారంపై హవగాహన







## - సీడిపిఓ సౌభాగ్యం

**కామారెడ్డి కోరుట్ల ప్రతినిది**
పిట్లం మండల కేంద్రంలోని ఏడవ, నాలుగవ సెంటర్ లో పోషకాహార భాగములో సీడిపిఓ సౌభాగ్య అధ్వర్యంలో పూర్వ ప్రాథమిక విద్య, మూడు సంవత్సరాల లోపు పిల్లలకు పోషకాహారం అభివృద్ధి ప్రేరణ కలిగించే అంశాలపై కుటుంబ సభ్యులకు అవగాహన కల్పించారు.ఆనంతరం సిడిపిఓ సౌభాగ్య మాట్లాడుతూ...మూడు నుండి ఆరు సంవత్సరాల వయసు గల పిల్లలను పుర్వవిద్య గురించి తెలియజేశారు.అదేవిధంగా ఆ వయసు పిల్లలను అంగన్వాడీలో పిల్లలలో మొదలయ్యే ఎదుగుదల గురించి క్షుణంగా తల్లిదండ్రులకు వివరించారు.మూడు నుంచి ఆరు సంవత్సరాల పిల్లలను అంగన్వాడీలో చేర్పించడం వలన పిల్లలలో మానసిక ఉల్లాసం మరింత పెరుగుతుందని తెలియజేశారు. పిల్లల పెరుగుతున్న వయసును గుర్తించుకొని వారికి ప్రాథమిక పాఠశాలపై అవగాహన కలిగే విధంగా అంగన్వాడి పాఠశాలలో మాత్రమే నేర్పడం జరుగుతుందని అన్నారు. అంగన్వాడీలో చదువుతో పాటు,ఆరోగ్యం పిల్లల మానసిక ఉల్లాసానికి ఆటలు బోధనలోనూ కొత్త పద్ధతులతో సరికొత్త విద్య అందుచడం జరుగుతుంది అన్నారు.రెండున్నర వయసు వారి నుంచి ఐదేళ్ల పిల్లల వరకు ఆకర్షితలై ప్రతి అంశంలోనూ మెరుగుపడుతున్నాయి. ఓవైపు కేంద్రంలోనూ కొత్త విధానంలోకి తీసుకురావడంతో పాటు మరోవైపు బలోపేతం చేసేందుకు కృషి చేస్తున్నారు. చిరుధాన్యాలు ఆకుకూరలలో పోషక విలువలు ఉంటాయని వివరించారు.ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు ప్రవీణ,రాధ, బాలమని,విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# ఘనంగా శ్రీ దుర్గామాత అమ్మవారు

## - నవరాత్రి ఉత్సవాలు



**శంకరపట్నం కోరుట్ల ప్రతినిది**
శంకరపట్నం మండలం కేంద్రంలోని వివిధ గ్రామాలతో పాటు కన్నాపూర్ గ్రామంలో అభయాంజనేయ స్వామి దేవాలయంలో దేవి నవరాత్రి ఉత్సవాల్లో శ్రీ దుర్గా మాత విగ్రహాన్ని ప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహించారు ఆలయ అర్చకులు మురళీధర్ ఆచార్యులు వేదమంత్రచ్చారణాలతో అమ్మవారిని ప్రతిష్ఠించారు దేవీ నవరాత్రుల్లో అమ్మవారు ఒక్కో రోజుకు ఒక్కో అవతారంలో భక్తులకు దర్శన మిస్తారు ఈ కార్యక్రమంలో విగ్రహ దాత తాటికొండ సదానంద చారి కుటుంబ సభ్యులు మాజి సర్పంచి వెంకట రమణారెడ్డి శ్రీ మతి దంపతులు మాజి ఎంపీటీసీ మోతె భాగ్యలక్ష్మి యెల్లారెడ్డి దంపతులు శివరామకృష్ణ భజన మండలి భక్తులు ఆంజనేయ భజన మండలి సభ్యులు ప్రజలు పాల్గొన్నారు

# క్రీడాకారులకు అభినందనలు





**కొడిమ్యాల కోరుట్ల ప్రతినిది**
జగిత్యాల జిల్లా కొడి మ్యాల మండల పరిధిలోని హిమాచలాపేట గ్రామానికి చెందిన నలుగురు క్రీడాకారులను సర్పంచ్ల ఫోరం మాజీ అధ్యక్షుడు కృష్ణారావు అభినందించారు. హిమ్మత్ రావు పేట గ్రామానికి చెందిన పలువురు క్రీడాకారులు ఎస్ జీ ఎఫ్ జిల్లా స్థాయిలో ప్రతిభకనపరిచారు. బహుమతులు సాధించారు. గ్రామానికి చెందిన క్రీడా కారులను క్రీడా కారులను ప్రతిరోజూ ప్రోత్సహించిన సహకరించిన సీనియర్ క్రీడాకారులు ఎంద్రికాయల శ్రీనివాస్ ను ప్రత్యేకంగా శాలువ కప్పి ఆయన అభినందించారు.కార్యక్రమంలో పలువురు క్రీడాకారులు, పాక్స్ చైర్మన్ పాలు రాజేందర్ గ్రామ పెద్దలు బండిరాజు పాల్గొన్నారు.

# పిల్లలకు సమతుల ఆహారాన్ని అందించాలి..

## - అంగన్వాడీ సూపర్వైజర్ నాగరాణి



**బెజ్జంకి, కోరుట్ల ప్రతినిధి**
చిన్న పిల్లలకు తల్లులు సమతుల ఆహారాన్ని అందించాలని అంగన్వాడి సూపర్వైజర్ నాగరాణి సూచించారు. లక్ష్మీపూర్ గ్రామంలో సోమవారం పోషణ మాసం సందర్భంగా అంగన్వాడీ కేంద్రంలోని అవగాహన కార్యక్రమాలు నిర్వహించబడ్డాయి. ఈ సందర్భంగా గర్భధారణ సమయంలో తీసుకోవలసిన జాగ్రత్తలు, శిశువు పుట్టిన మొదటి రోజునుండి రెండు సంవత్సరాల వయస్సు వరకు (మొదటి 1000 రోజులు) పోషకాహారం ఎంత ముఖ్యమో తల్లులకు వివరించారు.
తల్లిదండ్రులు పిల్లలకు సమతుల ఆహారం అందించడం ద్వారా శారీరక%-%మానసిక వికాసం సక్రమంగా జరుగుతుందని అధికారులు తెలిపారు. 3%-%6 సంవత్సరాల పిల్లలు తీసుకోవలసిన ఆహార పదార్థాలపై వివరణ ఇవ్వడంతో పాటు అంగన్వాడీ కేంద్రాల్లో బోధించే ప్రీ-స్కూల్ విద్యా కార్యక్రమాల ప్రాముఖ్యతను కూడా వివరించారు.
అవగాహన కార్యక్రమం అనంతరం పాల్గొన్న తల్లులందరితో పోషణ మాసం ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్ వెంకటలక్ష్మి పాల్గొని తల్లులకు పలు సూచనలు చేశారు. గ్రామంలోని పలువురు తల్లులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# వెంటనే సాగు వివరాలు నమోదు చేసుకోవాలి

## - మండల వ్యవసాయ అధికారి బి.సంతోష్



**బెజ్జంకి, కోరుట్ల ప్రతినిది**
వానాకాలం 2025లో సాగు చేస్తున్న పంటల వివరాలను రైతులు తప్పనిసరిగా తమ గ్రామ వ్యవసాయ విస్తరణ అధికారి వద్ద నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి బి.సంతోష్ రైతు సోదరులను కోరారు.
ఈ సీజన్‌లో మండలంలో విస్తృత స్థాయిలో పత్తి, వరి, మొక్కజొన్న తదితర పంటలు సాగు చేస్తున్నారు. ఇప్పటికే కొంతమంది రైతులు తమ వివరాలను నమోదు చేయగా, ఇంకా చాలా మంది నమోదు చేయకపోవడం గమనార్హమని అధికారులు తెలిపారు.
రైతులు ఆలస్యం చేయకుండా తమ పంట వివరాలను నిర్దిష్ట తేదీలలోపు సమర్పించాలని సూచించారు. ఈ నెల 25వ తేదీ లోపు పత్తి పంట సాగు వివరాలు, 30వ తేదీ లోపు మొక్కజొన్న పంట వివరాలు నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. పంట నమోదు ప్రక్రియలో భాగంగా ప్రభుత్వం సమయానుకూలంగా పలు రకాల సహాయం అందజేస్తుందని, నమోదు చేయని రైతులు ఆ ప్రయోజనాలకు నోచుకోలేరని హెచ్చరించారు.రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ గ్రామ ఏఈవో వద్ద వెంటనే వివరాలు నమోదు చేసుకోవాలని బి.సంతోష్ చేశారు. పలు గ్రామాలలో పంట నమోదు కార్యక్రమం జరుగుతుందని వివరించారు.

# సింగరేణి ఓ ఉద్యోగాల గని మీడియా సమావేశంలో భట్టి

సింగరేణి సంస్థ బొగ్గు గని మాత్రమే కాదని, అది ఒక ఉద్యోగ గని అని డిప్యూటి సిఎం భట్టివిక్రమార్క తెలిపారు. సింగరేణి సంస్థ రాష్ట్రప్రభుత్వానికి ఆత్మవంటిదని అన్నారు. సింగరేణి కార్మికులకు బోనస్ ప్రకటించిన సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. సింగరేణి సంస్థను జాగ్రత్తగా నడుపుతున్న కార్మికుల సంక్షేమం కోసం కృషి చేస్తున్న సింగరేణి యాజమాన్యానికి అభినందనలు తెలియజేశారు.